నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వనపర్తి

సోమవారం 16 అక్టోబర్ 2023
MONDAY, OCTOBER 16, 2023
WANAPARTHY
పేజీలు PAGES : 12


బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఆదివారం ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించారు. అందులో సంక్షేమానికి, పేదల కు అధిక ప్రాధాన్యతనిచ్చారు. రోజువారీ జనావసరాల్లో భాగమయ్యేలా రూపొందించిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండ్‌బ్లాంక్ అయ్యింది. ప్రజలు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించే ఆసరా పింఛన్‌ను గణనీయంగా పెంచడం విశేషం. రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందించేందుకు 'అన్నపూర్ణ'ను ప్రవేశపెట్టారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని, ఏ పార్టీ ప్రవేశపెట్టని విధంగా ప్రజలందరికీ లబ్ధి చేకూరేలా ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. 'కేసీఆర్ బీమా.. ప్రతి కుటుంబానికి ధీమా'తో రాష్ట్ర వ్యాప్తంగా 93 లక్షల కుటుంబాలకు లబ్ధి కలుగనున్నది. ఈ పథకం కింద కుటుంబంలో ప్రతిఒక్కరికీ రూ.5లక్షల బీమా సదుపాయం కల్పించింది. రైతుబంధు సాయాన్ని అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది రూ.12 వేలకు చేయనున్నది. వచ్చే ఐదేండ్లనాటికి రూ.16వేలకు చేరనున్నది. పేదలు, జర్నలిస్టులకు రూ.400కే సిలిండర్ అందించాలని నిర్ణయించింది. అయితే, ఈ మ్యానిఫెస్టో సూపర్‌హిట్టు అని విశ్లేషకులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. బీఆర్‌ఎస్‌కు ఇక తిరుగులేదని ముక్తకంఠంతో చెబుతున్నారు.

*- నాగర్‌కర్నూల్/వనపర్తి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ)*



వనపర్తి జిల్లా కేంద్రంలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

# మ్యానిఫెస్టో.. సూపర్‌హిట్టో

- బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రణాళికను ప్రకటించిన సీఎం కేసీఆర్
- సంక్షేమం, పేదలకు అధిక ప్రాధాన్యం
- రేషన్ కార్డు ఉన్న వారికి 'అన్నపూర్ణ'
- 'కేసీఆర్ బీమా.. ప్రతి కుటుంబానికి ధీమా'తో భరోసా
- పేదలు, జర్నలిస్టులకు రూ.400కే సిలిండర్
- గణనీయంగా ఆసరా పింఛన్, రైతుబంధు సాయం పెంపుదల


లోపలి పేజీల్లో..


## కేసీఆర్ సారు సల్లగ ఉండాలె..



నెల నెలకి రూ.2వేల పింఛన్ వస్తుంది. ఈ ఏడు మల్ల పెంచుతాండు. ఏడాదికి రూ.500 పెంచుకుంటూ రూ.5వేల వరకు ఇస్తానన్నాడు. మాలాంటి పండుటాకులకు సర్కారు ఇచ్చే పింఛనే ఆధారం. నెల నెలా ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్ వస్తుంది. అట్లనే గ్యాస్ బండ కూడా తక్కువ చేస్తానన్నాడు. నాలుగైదు వందలు ఉన్న గ్యాస్‌బండ ఉన్నట్లుండి రూ.1200 వరకు వచ్చింది. ఏం అర్థం కానట్ల పెరిగింది. శానా మంది గ్యాస్‌బండలు తీసేసి కట్టెలపొయ్యి పెట్టుకున్నరు. కేసీఆర్ సారు మల్లసారి వస్తే గ్యాస్‌బండ రూ.400లకు ఇస్తానన్నాడు. మస్త్ మందికి గ్యాస్‌బండ పనికొస్తది. అందుకే సారు ధర తగ్గిస్తానన్నాడు. మాలెక్కటోల్లకోసమే కేసీఆర్ సారు ఆలోచిస్తున్నడు. ఈసారి కూడా కారుగుర్తుకే ఓటు వేసి సారును గెలిపిస్తాం. నాలెక్కటోల్లు ఎంతోమంది సంతోషపడతారు.

**- గొల్ల రత్నమ్మ, ఆత్మకూరు**

- ఆయా నియోజకవర్గాల్లో కార్యకర్తల సంబురాలు
- 'కారు' జోరును ఢీకొనలేక ప్రతిపక్షాల బెంబేలు
- కాంగ్రెస్‌లో తారాస్థాయికి చేరిన టికెట్ల లొల్లి
- అభ్యర్థులు లేక ఢీలా పడిన బీజేపీ
- గులాబీ గూటికి చేరేందుకు కాంగ్రెస్, బీజేపీ నేతల క్యూ
- అలంపూర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో చర్చలు

*బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గెలుపుగుర్రాలకు ఆదివారం ప్రగతిభవన్‌లో బీ ఫారాలు అందజేశారు. అలంపూర్ అభ్యర్థికి మినహా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 11 మందికి బీ ఫారాలు పంపిణీ చేశారు. సిట్టింగులకే పట్టం కట్టడంతో పార్టీ శ్రేణులు, అభిమానుల్లో సంబురం నెలకొన్నది. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ కేంద్రాల్లో పటాకులు కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. 'గులాబీ' గుబాళించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకే అభ్యర్థులంతా ఆయా నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనలు చేశారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో సందడి చేశారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసిన స్థానాల్లో టికెట్ల లొల్లి తారాస్థాయికి చేరుతున్నది. ఎక్కడికక్కడ అసంతృప్తులు వెల్లువెత్తుతుండడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇక 'కమలం' చాటున పోటీ చేసేందుకు అభ్యర్థులు కరువయ్యారు. ఇప్పటివరకు చడీచప్పుడు లేకపోవడంతో క్యాడర్‌లో అయోమయం నెలకొన్నది. 'కారు' జోరును తట్టుకోలేక ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయి. గులాబీ తీర్థం పుచ్చుకునేందుకు గ్రామాల్లో విపక్షాల నాయకులు క్యూ కడుతుండడంతో వారిని నిలువరించలేక నానా తంటాలు పడుతున్నారు. కారు టాప్ గేర్ అందుకోవడంతో ముచ్చెమటలు పడుతున్నాయి.*

*- మహబూబ్‌నగర్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

# గులాబీ గుబాళింపు

- సిట్టింగులకే బీఫారాలు అందజేసిన సీఎం కేసీఆర్
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 11 మందికి పంపిణీ



సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫారం అందుకుంటున్న మంత్రి నిరంజన్‌రెడ్డి





బీఫారం అందుకుంటున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు వెంకటేశ్వర్‌రెడ్డి





బీఫారం అందుకుంటున్న ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి




సెంటర్ స్ప్రెడ్‌లో..